క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరం



పెర్కిట్: ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన కంటి వైద్య నిపుణుడు శ్రీనివాస్ వైద్య బృందం గ్రామానికి చెందిన 170 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. లోపాలు ఉన్న వారికి కంటి అద్దాలతో పాటు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు కుంట గంగారెడ్డి, మురళీ, వినోద్ రెడ్డి, ఎంకే భాజన్న, కేకే వెంకట్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాల్కొండ: మండలంలో ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన ధనుంజయ్ కుటుంబానికి తోటి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. 1998–99 విద్యాసంవత్సరంలో పెర్కిట్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ. 50వేల ఆర్థికసాయాన్ని బాల్కొండ మండల కేంద్రంలో అందజేశారు. కార్యక్రమంలో ఇట్టెడి మోహన్‌రెడ్డి, మూడ అశోక్, భూమేశ్వర్, లక్ష్మీనారయణ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తలపెట్టిన స్వచ్ఛ కార్యాక్రమంలో భాగంగా ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ కార్యాక్రమం నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేద ప్రజలకు మేలు



వేల్పూర్: కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో పేద ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని వేల్పూర్ మండల బీజేపీ నాయకులు ఆదివారం పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి అమలయ్యే జీఎస్టీ సంస్కరణలతో ఎరువులు, డ్రిప్, వ్యవసాయ యంత్ర పరికరాలపై జీరో శాతం జీఎస్టీ ఉండబోతోందని అన్నారు. పాల ఉత్పత్తులు, వైద్య ఉపకరణాలు, ఔషధాలపై ధరలు తగ్గుతాయన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు బెల్దారి నవీన్, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నోముల నర్సారెడ్డి, నాయకులు రాజారెడ్డి పాల్గొన్నారు.

వైద్యునికి సన్మానం



నవీపేట: మండలంలోని యంచ గ్రామానికి చెందిన నాగ లింగం గౌడ్, శశికళ దంపతుల కుమారుడు సతీశ్ గౌడ్ విదేశాలలో చదివి ఎంబీబీఎస్ పట్టాతో ఆదివారం గ్రామానికి రావడంతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన ప్రథమ వైద్యుడు కావడంతో గ్రామస్తులు వైద్యునితో పాటు తల్లిదండ్రులను సన్మానించారు.

పట్టుకోండి చూద్దాం!

- పోలీసులకు సవాల్ విసురుతున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు
- లిఫ్టులను లక్ష్యంగా చేసుకుని చోరీలు
- ఎంత ప్రయత్నించినా చిక్కని దోపిడీ దొంగలు



డొంకేశ్వర్‌లో దొంగలు ధ్వంసం చేసిన ఎత్తిపోతల ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)



దత్తాపూర్ లిఫ్టులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్(ఫైల్)

డొంకేశ్వర్: ఊరి బయట ఉన్న ఎత్తిపోతల పథకాలను లక్ష్యంగా చేసుకుని దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. పోలీసులకు చిక్కకుండా వరుస దొంగతనాలకు పాల్పడుతూ సవాల్ విసురుతున్నారు. ఇటీవల కాలంలో డొంకేశ్వర్‌తో పాటు చుట్టుపక్కల మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు పెరిగిపోయాయి. కానీ దొంగలను పట్టుకునే విషయంలో పోలీసులకు ఎలాంటి మార్గం దొరకడం లేదు. కేసుల్లో కనీస పురోగతి కనిపించకపోవడం వారిని తీవ్రంగా కలవరపెడుతోంది. డొంకేశ్వర్ మండల పరిధిలో మొత్తం ఐదు ఎత్తిపోతల పథకాలు ఉండగా, ప్రతీదానికి ఫేజ్–1, ఫేజ్–2 లిఫ్టులున్నాయి. రెండు రోజుల క్రితం ఊరికి దూరంగా ఉన్న ఫేజ్–1 లిఫ్టుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ దోపిడీకి గురైంది. దానిని ధ్వంసం చేసి అందులోని విలువైన ఆయిల్, కాపర్ వైరు, కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.5లక్షలు ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. అలాగే ఇటీవల దత్తాపూర్ లిఫ్టుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఉపకరణాలను ఎత్తుకెళ్లారు. ఈ రెండు ఘటనలకు ముందు చుట్టు పక్కల మండలాల్లోని గ్రామాల్లో కూడా ఎత్తిపోతల ట్రాన్స్‌ఫార్మర్లు దోపిడీకి గురయ్యాయి. మళ్లీ బిగించుకోవాలంటే రైతులపై భారం పడుతోంది. అయితే దొంగలు పక్కా ప్లాన్‌తో కేవలం రాత్రుల్లోనే ఈ దొంగతనాలను పాల్పడుతున్నారు. వరుస ఘటనలు రైతులను ఆందోళనకు గురి చేస్తుండగా, పోలీసులకు పరీక్ష పెడుతున్నాయి. కాపలా ఉందామన్నా దోపిడీ దొంగలు ఎక్కడ దాడులు చేస్తారోనని రైతులు భయపడుతున్నారు.

లిఫ్టుల వద్ద నిఘా పెడతాం

దోపిడీ దొంగలు ఎత్తిపోతల ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని చోరీ చేస్తున్నారు. దొంగలను పట్టుకునేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నాం, లిఫ్టుల వద్ద నిఘా ఉంచుతాం. కచ్చితంగా దొంగలను పట్టుకుంటాం.

– శ్యామ్‌రాజ్, ఎస్సై, నందిపేట్

ప్రమాదం అంచున ప్రయాణం



రెంజల్ మొండి వాగు వద్ద దిగబడిన వాహనాన్ని నెట్టుతున్న స్థానికులు



వంతెన పై దిగబడిన వాహనం

- పట్టించుకోని అధికారులు
- దిగబడుతున్న వాహనాలు
- ఆస్పత్రుల పాలవుతున్న వాహనదారులు

రెంజల్: రెంజల్ శివారులోని మొండి వాగు వద్ద వాహనదారులు ప్రమాదం అంచున ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పట్టించుకోవాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు నిద్రావస్థలో ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. 13 ఏళ్ల క్రితం రెంజల్ శివారులోని మొండి వాగుపై లోలెవల్ వంతెన ఉండగా నాటి ప్రభుత్వం హై లెవల్ వంతెనను నిర్మించింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అప్రోచ్ రోడ్డును చేపట్టకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. వాహనాలు దిగబడుతున్నాయి. ఇటీవల సాక్షిలో 'వంతెన నిర్మించారు అప్రోచ్ మరిచారు' అనే శీర్షికతో వచ్చిన కథనానికి ఆర్అండ్‌బీ డీఈఈ స్పందించి నామ మాత్రంగా ఒక పక్క మొరం వేయించి చేతులు దులుపుకొన్నారు. వంతెనకు మరో పక్క అప్రోచ్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా తయారైంది. నిత్యం ఈ రహదారి మీదుగా వందల వాహనాలు తిరుగుతుంటాయి. ఇక్కడకు వచ్చే సరికి ప్రాణాలను అర చేతిలో పట్టుకుని ప్రయాణం సాగించాల్సి వస్తోంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండల వాసులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, మండలవాసులు కోరుతున్నారు.

అయ్యప్ప సేవా పరివార్ సమావేశం



కోటగిరిలో మాట్లాడుతున్న అయ్యప్ప దాస్

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ సాయి అయ్యప్ప ఆలయంలో ఆదివారం అయ్యప్ప సేవా పరివార్ జోనల్ లెవెల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ తెలంగాణ రాష్ట్ర కమిటీ జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాస్ హాజరై మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా అయ్యప్పతత్వం ప్రతి ఒక్కరిలో జ్ఞానాన్ని, దైవత్వాన్ని అందిస్తుందని అన్నారు. అయ్యప్ప సేవలో నడవాల్సిన విషయాలు, గురుస్వాముల బాధ్యతలు, అయ్యప్ప, మణికంఠ, ధర్మశాస్త్ర సంబంధమైన వివరాల గూర్చి సంఘ సభ్యులకు వివరించారు. సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్, కేరళ, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి సభ్యులు హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త పోలా విఠలరావు గుప్తా, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోగినేని హనుమంతరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలరావు, రాష్ట్ర అధ్యక్షుడు రాజు, జాతీయ కార్యవర్గ సభ్యులు బీర్కూర్ గంగాధర్, శంకర్, సుబ్రహ్మణ్యస్వామి, బర్ల రమేశ్, అంజిబాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మోక్షం లేని మండల పరిషత్ ప్రహరీ



భారీ వర్షాలకు గతేడాది కూలిపోయిన వేల్పూర్ మండల పరిషత్ ప్రహరీ

వేల్పూర్: గతేడాది భారీ వర్షాలకు కూలిపోయిన వేల్పూర్ మండల పరిషత్ ప్రహరీ నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. మండల పరిషత్ కార్యాలయం వెనుక వైపు సుమారు 50 మీటర్ల వరకు ప్రహరీ కూలిపోయింది. నాటి నుంచి ప్రహరీ నిర్మాణం చేపట్టడం లేదు. స్థానిక మర్సుకుంట చెరువు కిందనే మండల పరిషత్ కార్యాలయం ఉండడంతో కార్యాలయంలోకి విషపు పురుగులు, పాములు తరచూగా వస్తుంటాయి. ప్రహరీ పూర్తిగా ఉన్నప్పుడే విషపు పురుగుల ప్రమాదం ఉండగా, ఇప్పుడు గోడ లేకపోవడంతో ప్రమాదం మరింత అధికమైందని సిబ్బంది వాపోతున్నారు. అంతేగాక దొంగలు కూడా కార్యాలయంలో చొరబడే ప్రమాదం ఉందంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో బాలకిషన్‌ను వివరణ కోరగా నిధుల కొరతతో ప్రహరీ నిర్మించడం లేదని పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీల ఆగడాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న విఠల్ గౌడ్

రుద్రూర్: గ్రామాభివృద్ధి కమిటీల ఆగడాలను అరికట్టాలని గీతా పనివారాల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర గీతా పనివారాల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిలాలోని ఆర్మూర్ ప్రాంతంలో వీడీసీల ఆగడాలు మితిమిరిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌లో గౌడ గీత వృత్తిదారులపై దాడులు జరిగాయని వాపోయారు. ఎవరి వృత్తిపై దాడి చేసినా అన్ని కుల వృత్తిదారులు, బహుజనులు ఐకమై ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో టీజీఎస్ నాయకులు బి.వెంకగౌడ్, శ్రీధర్‌గౌడ్, ప్రకాశ్‌గౌడ్, గంగాప్రసాద్‌గౌడ్, రాజాగౌడ్, సాయికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మక్క రైతును వెంటాడుతున్న వర్షం

- శనివారం రాత్రి కురిసిన వాన
- తడిసి ముద్దయిన మక్కలు



ముప్కాల్ మండలం రెంజర్లలో తడిసి ముద్దయిన మక్కలు



మెండోరా మండలం సోన్‌పేట్‌లో కొట్టుకు పోయిన మక్కలను ఏరుతున్న మహిళా రైతు

బాల్కొండ: మక్క రైతులను వర్షాలు వెంటాడుతున్నాయి. వారం రోజుల నుంచి వర్షం కొంత తెరపి ఇవ్వడంతో మక్క రైతులు కోతలను వేగం చేశారు. అలాగే మక్కలను నూర్పిడి చేసి రోడ్లపై ఆరబెట్టారు. కానీ మళ్లీ వాన దంచి కొట్టడంతో మక్క రైతులు దిక్కు తోచని స్థితిలో పడిపోయారు. శనివారం రాత్రి ఒక్క సారిగా భారీ వర్షం కురవడంతో రోడ్లపై ఆరబెట్టిన మక్కలు తడిసి ముద్దాయ్యాయి. పొలాల్లో ఉన్నమక్క కంకులు నీట మునిగాయి. మక్కలు తడవకుండా రైతులు తాటి పత్రాలను కప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. చేతికొచ్చిన పంట నీటి పాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే మక్క వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలను తగ్గించారు. ప్రస్తుతం కురిసిన వర్షాలతో మరింత ధరను తగ్గిస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం వలన తడిసి ముద్దయిన మక్కలు ముక్కి పోయి రంగు మారుతాయి. అంతే కాకుండా అడుగున ఉన్న మక్కలు మొలకెత్తే ప్రమాదం ఉంది. మెండోరా మండలం సోన్‌పేట్‌లో శనివారం రాత్రి తర్వాత కురిసిన వర్షానికి రైతు ఎట్టం మల్లేశ్ రోడ్డుపై ఆరబెట్టిన మక్కలు కురిసిన వర్షానికి మైనర్ కాలువలోకి కొట్టుకుపోయాయి. సుమారు సగం ట్రాక్టర్ మక్కలు కొట్టుకుపోయాయని రైతు వాపోయాడు. కొట్టుకు పోయిన మక్కలను కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం ఏరారు. వర్షాలతో పంట నష్టం జరిగితే ప్రభుత్వం ఆదుకోవాలని మక్క రైతులు కోరుతున్నారు.

పూర్తిగా తడిచిపోయాయి



శనివారం రాత్రి ఒక్క సారిగా భారీ వర్షం కురవడంతో రోడ్డుపై ఆరబెట్టిన మక్కలు తడిసి ముద్దయ్యాయి. దీంతో మక్కలు రంగు మారే అవకాశం ఉంది. ఇది వరకే వ్యాపారులు ధర తగ్గించారు. మరింత తగ్గిస్తారని ఆందోళనగా ఉంది.

– ధర్పల్లి నవీన్, రైతు, రెంజర్ల

ప్రతి ఏడాది ఇదే తిప్పలు..



మక్క కోతల సమయంలో ఏటా వర్షం కురుస్తుంది. ప్రతి ఏడాది మక్కలను ఆరబెట్టేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. మక్కలను ఆరబెడితే మళ్లీ వర్షం కురుస్తోంది. నిత్యం మక్కల కోసం రెక్కలు ముక్కలు చేసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ప్రశాంత్, రైతు, రెంజర్ల

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు



ముప్కాల్‌లో లక్ష్మణ్ బాపూజీకి నివాళులు అర్పిస్తున్న పద్మశాలి సంఘ సభ్యులు



రుద్రూర్ చేనేత సహకార సంఘంలో..



రుద్రూర్ బీఆర్ఎస్ కార్యాలయంలో..



ఆర్మూర్: ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

బాల్కొండ/ ఆర్మూర్‌టౌన్/ నందిపేట్/ రుద్రూర్: ముప్కాల్ మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం రెండో పంథా ఆధ్వర్యంలో ఆదివారం కొండా లక్ష్మణ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య, తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాల గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని చేనేత కాలనీలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక మోహన్‌దాస్, ఖాందేశ్ శ్రీనివాస్, బొడ్డు గంగాధర్, ఖాందేష్ సంగీత, జిందం నరహరి, యఘ్నేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు. నందిపేట్ మండల కేంద్రంలోని నంది చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద మైపాల్, నాయకులు ఇసుబ్, దమ్మాయి శ్రీను, జమీల్, దేవిదాస్ గౌడ్, మన్సూర్ భూమేశ్, మేరా శ్రీను, కాంతం చిన్నయ్య, రఫీక్, సాయారెడ్డి కాల భోజన్న, నరోత్తమ్ తదితరులు పాల్గొన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ గణేశ్, మాజీ డైరెక్టర్ జువ్వల పోతన్న, తాటిపాముల విజయ్, గంగుల గంగాధర్, దువ్వల రవి, రజాక్, శ్రీనివాస్, సంఘ మేనేజర్ ఈర్వ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. బాపూజీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి గాండ్ల మధు, సిరిగాధ శేఖర్, ఆర్. పోచయ్య, డి. సాయిలు, కె.శంకర్, బి. గజేందర్, ఎన్. సాయిలు తదితరులు పాల్గొన్నారు.



నందిపేటలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వానొస్తే.. రోడ్లన్నీ చెరువులే!

- జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాలు
- ఇబ్బంది పడుతున్న ఆర్మూర్ పట్టణవాసులు



గీతాభవనం ఎదుట నిలిచిన వర్షపు నీరు(ఫైల్)



యోగేశ్వర కాలనీలో చేరిన వరద నీరు



పెర్కిట్ వెళ్లేదారిలో వరద చేరడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని రహదారులు వర్షం పడితే చెరువులను తలపించేలా మారుతున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో పలు వీధుల్లో నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాత్రి సైతం వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాధారణ వర్షం పడినా రహదారులు ముంచెత్తిపోవడం, మురికికాలువ పారుదల వ్యవస్థ సరిగా లేకపోవడంతో పట్టణ ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతి ఏడాది మున్సిపల్ అధికారులు పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నా ముంపు ప్రదేశాల్లో మాత్రం నివారణకు చర్యలు తీసుకోవడం లేదు.

పట్టణంలోని పెర్కిట్‌కు వెళ్లేదారి, మామిడిపల్లి నుంచి ఆర్మూర్ వచ్చే రహదారి, హౌసింగ్ బోర్డు వెళ్లే, యోగేశ్వర కాలనీకి వెళ్లే, వేంకటేశ్వర కాలనీకి వెళ్లేదారులు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. మామిడిపల్లి, పెర్కిట్‌లోని పలు చిన్న వీధులు సైతం వర్షపు నీరు నిండుతుండటంతో బైక్‌లు, ఆటోలు ప్రయాణించేందుకు సవాలుగా మారాయి. విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు కష్టమవుతోంది. రాత్రి సమయాల్లో నిల్వ ఉన్న నీటిలో రహదారి గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు అభివృద్ధి పేరుతో నిధులు ఖర్చు చేస్తున్నా ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆరోపిస్తున్నారు. రోడ్ల పునరుద్ధరణ, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదలపై మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

ప్రతిరోజు కాలనీల్లోని వీధుల్లో నీరు నిల్వ ఉండటంతో అపరిశుభ్రత, దుర్వాసన వస్తోంది. దీనికి తోడు దోమల వ్యాప్తితో ఇంట్లో ఉన్న అందరికి జ్వరాలు వస్తున్నాయి. అధికారులు స్పందించి కాలనీలోని రోడ్లపై నీరు నిలువ లేకుండా చూడాలి. – రాజవ్వ, హౌసింగ్‌బోర్డు, ఆర్మూర్

పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

రహదారులపై నీరు నిలవడంతో పాటు పలు ప్రాంతాల్లో నీరు ఇళ్లల్లోకి చేరుతోంది. వాటిని నివారించడంపై చర్యలు త్వరలో చేపట్టనున్నాం. వరదనీరు ఆగకుండా శాశ్వాతంగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడతాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

మారథాన్ అంబాసిడర్ అశోక్‌కు సన్మానం



వేల్పూర్: మండల కేంద్రానికి చెందిన మారథాన్ గుగ్గిలం అశోక్‌ను ఆదివారం వేల్పూర్‌లో రెడ్‌రోజ్ యూత్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కామారెడ్డి జిల్లాలో హోంగార్డుగా కొనసాగుతున్న అశోక్ దశాబ్దానికిపైగా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న మారథాన్ పోటీల్లో పాల్గొంటూ ఎన్నో పతకాలు సాధించాడు. వచ్చేనెల 2న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే అమరావతి మారథాన్‌కు అశోక్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యాడు. యూత్ సీనియర్ సభ్యుడు గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ.. అశోక్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక కావడం వేల్పూర్‌కు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.